క్లుప్తంగా

నేడు గోవా గవర్నర్ రాక

మహారాణిపేట: గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లాయ్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం భోగాపురంలో ఉన్న సన్ రే రిసార్ట్స్‌కు వెళతారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో అనంతరం తిరిగి విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 4.15గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్‌బోర్డు ప్రమాణ స్వీకారం



ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎస్ ప్రశాంతి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా దశమంతుల మాణిక్యాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఐదుగురు సభ్యులు కోరాడ సురేష్, కడితి రమణమ్మ, ఎస్. సత్యవతి, దొడ్డి పైడిరత్నం, సూరిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి నిస్వార్థంగా సేవలందించి, సన్మార్గంలో నడిచే మంచి వ్యక్తులను ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఎంపిక చేస్తారన్నారు. వీరి సమక్షంలో టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్ బోర్డు మరింత అభివృద్ధి చెందేలా సేవలందించాలని ఆకాంక్షించారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. సీఎం జగన్‌కు దేవుని ఆశీస్సులు ఉండాలని అభిలషించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఎన్‌జీవోల నిరసన ప్రదర్శన

మహారాణిపేట : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన రెండు రోజు కూడా కొనసాగింది. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌జీవో హోమ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ఆర్.రవిశంకర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 12 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 వీఎన్ మణికంఠ చందోలు

అల్లిపురం : ప్రతి నెల 1, 15 తేదీల్లో నిర్వహించే డయల్ యువర్ సీపీ కార్యక్రమంలో భాగంగా గురువారం 12 ఫిర్యాదులు వచ్చాయి. నగర శాంతిభద్రతల డీసీపీ-1 వీఎన్ మణికంఠ చందోలు ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల్లో పద్మనాభం, పాండురంగాపురం, చినవాల్తేరు ప్రాంతాల నుంచి ముగ్గురు వృద్ధులు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. దీంతో ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యను పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 0891-2523408 నేరుగా ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. అదే విధంగా ఫొటోలు, వీడియోలతో కూడిన ఫిర్యాదులను 9493336633 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా కూడా ప్రజలు నేరుగా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు.

విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలకు స్వర్ణయుగం



జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా గ్రంథాలయాలు పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తున్నాయి. రూ.100 కోట్ల విలువైన స్థలాన్ని టీడీపీ మాజీ మంత్రి కొట్టేయాలని చూస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి వెనక్కి తీసుకొచ్చి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకి ప్రాణం పోసింది. టీడీపీ హయాంలో సాధారణ పుస్తక కొనుగోలు కింద ఒక్క పుస్తకం కూడా కొనలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక సాధారణ పుస్తక కొనుగోలు కింద రూ.కోటి 10 లక్షలు విలువ చేసే కొత్త పుస్తకాలు కొనుగోలు చేశారు. సుమారు రూ.60 లక్షలతో పెయింటింగ్, టాయ్‌లెట్స్, కాంపౌండ్ వాల్స్, మంచినీటి సదుపాయం, సీలింగ్ వర్క్స్ చేయించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం గ్రంథాలయ సెస్ రూ.140 కోట్లు బకాయిలు పెడితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నెలకి రూ.50 లక్షలు చొప్పున సెస్ నిధులు విడుదల చేశారు. కేంద్ర గ్రంథాలయానికి రూ.24 కోట్లతో అంచనాలు ఆమోదించి తొలి విడతగా రూ.2 కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ ఏడాది గ్రంథాలయ బడ్జెట్ రూ.26 కోట్లతో ఆమోదించారు. బీడీసీ సెంటర్ ఆపరేటర్లకు రూ.500 ఉంటే రూ. 3 వేలకు పెంచారు. విలేజ్ లైబ్రేరియన్‌కి రూ.20 వేలకు పెంచారు. గత ప్రభుత్వ హయాంలో లైబ్రేరియన్లకు ఎటువంటి ప్రోత్సాహం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఆరుగురు లైబ్రేరియన్లకు మెరిట్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించారు.

– కొండా రాజీవ్‌గాంధీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి శాఖా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ (ఫైల్)

- విద్య, వికాసానికి తోడ్పడుతున్న గ్రంథాలయాలు
- లైబ్రరీల నిర్వహణను ప్రోత్సహిస్తున్న జగనన్న సర్కార్
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, పాఠకులు

దాబాగార్డెన్స్ : శిథిల భవనాలు.. పెచ్చులూడిన శ్లాబులు.. బీటలు వారిన గోడలు.. వర్షం పడితే గదులు జలమయం.. పాడైన విలువైన పుస్తకాలు.. ఆందోళనలో పాఠకులు.. ఇరుకైన అద్దె గృహాల్లో నిర్వహణ.. ఇదీ నాటి పాలకు హయాంలో గ్రంథాలయాల దుస్థితి. నాడు గ్రంథాలయాల నిర్వహణపై పాలకులు కనీసం పట్టించుకోకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అదంతా గతం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యకు పెద్దపీట వేశారు. అందులో భాగంగా పాఠశాలలతో పాటు విజ్ఞాన కేంద్రాలైన శాఖా గ్రంథాలయాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. లక్షలాది రూపాయలతో గ్రంథాలయ భవనాలు నిర్మించింది. గ్రంథాలయాలకు మోక్షం కలిగింది. నేడు గ్రంథాలయాల్లో అన్ని రకాల గ్రంథాలు, పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్స్, ఇంటర్నెట్ వంటివి అందుబాటులో ఉండడంతో పాఠకులు, విద్యావేత్తలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.



నూతన గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు





పోటీ పరీక్షలకు సిద్ధమైన అభ్యర్థులు



పుస్తకాలు పరిశీలిస్తున్న చిన్నారులు

ఆనందంగా ఉంది..



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రంథాలయాలకు మహర్దశ పట్టింది. పాఠకులకు ఇబ్బంది లేకుండా విశాలమైన భవనంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. పోటీ పరీక్షలకు చదివే విద్యార్థుల కోసం పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

– నాగ అరుణ్‌కుమార్, పాఠకుడు

జగనన్నకు రుణపడి ఉంటాం..



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఇక్కడి లైబ్రరీలో దినపత్రికలు, ఇతర కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ఇక్కడి పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– సాయి, విద్యార్థి

పెరుగుతున్న పాఠకుల సంఖ్య..



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి కాంపిటీటివ్ పుస్తకాలు, దినపత్రికలు, చిన్నారులకు కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సీఎం జగన్ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలతో పాటు గ్రంథాలయాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నారు.

– వర్మ, అసిస్టెంట్ లైబ్రేరియన్, జిల్లా కేంద్ర గ్రంథాలయం

సెయింట్ జోసెఫ్ విద్యార్థినికి బంగారు పతకం



హర్షశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కంచరపాలెం : జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బీబీసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కడలి హర్షశ్రీ అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో జరిగిన నిజి షాటో కాన్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో బంగారు పతాకం సాధించింది. ఈ మేరకు గురువారం కళాశాల సెమినార్ హాల్లో విజేత హర్షశ్రీని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఎంవీ రమణ, అధ్యాపకులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ అనుపమ, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మౌసమి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

4,157 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం అర్బన్ పరిధిలో 10 ప్రాంతాల్లో జరిగాయి. సాగర్‌నగర్, ఎంఎస్‌ఆర్ లేఅవుట్, ఎన్‌జీజీవో కాలనీ, భీమనగర్‌లో రెండు చోట్ల, రైల్వే న్యూకాలనీ, అంబేడ్కర్ కాలనీ, పెద గంట్యాడ, సిద్ధేశ్వరం, చంద్రనగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ శిబిరాల్లో మొత్తం 4,157 మందికి వైద్య సేవలు అందజేశారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల వేగవంతానికి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనారాయణస్వామి ఆలయ ఘాట్‌రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి స్థానికులు, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు నిర్మాణంలో ఉన్న 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేస్తే చిరు వ్యాపారులు, దుకాణదారులకు ఇబ్బందులు తొలగుతాయని, వాహన రాకపోకలు, స్థానికుల ఎన్నో ఏళ్ల కళ నెరవేరుతుందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సామాజిక భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికల అభివృద్ధితో పాటు వాటర్ సప్లై లైన్స్ క్లియర్ చేస్తే స్థానికులకు మేలు చేకూతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందివ్వడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

- దక్షిణ జోన్‌కు పెద్ద పీట

మహారాణిపేట : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. గురువారం ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా బీసీ సెల్ కమిటీ అధ్యక్షులుగా మన్యాల శ్రీనివాస్‌ను (విశాఖ సౌత్)నియమించారు. ఇతనితో పాటు బీసీ విభాగం సెక్రటరీలుగా మహంతి గౌరిశంకర్, మానేపల్లి రమణ, జాయింట్ సెక్రటరీలుగా కడుమంచి శ్రీను, మామిడి మోహన్ నాగేశ్వరరావు, బొట్టా రాంబాబులను నియమించారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి సత్తిరాజు, కార్యదర్శులుగా సురపతి దేవి, కోడూరు రూప, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.రాజు, యల్లమ్మలను నియమించారు. జిల్లా ఐటీ విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా లక్కోజు రోహిణీకుమార్, కార్యదర్శిగా పి.అజయ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎండాడ సురేష్, జి.నవీన్‌లను నియమించారు. జిల్లా మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శులుగా కె.కుమారి, సలాది భవానీ, కార్యదర్శులుగా గొలగాని లక్ష్మి, చింతపల్లి సత్యవతి, సంయుక్త కార్యదర్శులుగా మాకిన రమణమ్మ, పిళ్లా కనక మహాలక్ష్మిలను నియమించారు. జిల్లా మైనార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ఇబ్రహీమ్ జహంగీర్, కార్యదర్శులుగా మదీనా ఖాన్, షేక్ రఫీ అహ్మద్, సంయుక్త కార్యదర్శులుగా కె.హుస్సేన్ అహ్మద్, షేక్ అబ్దుల్‌ను నియమించారు. జిల్లా ఎస్‌సీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కె.సుధాకర్, కార్యదర్శులుగా చెన్నా శ్రీధర్, ధనాల రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా డి.శిరీష, పి.ఉర్వశిలను నియమించారు. జిల్లా ఎస్‌టీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా వి.బాలరాజు, కార్యదర్శులుగా డి.రమణ, డి.మాణిక్యంను నియమించారు. జిల్లా విద్యార్థి విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉదయ్, కార్యదర్శిగా సూర్యప్రకాష్, కె.నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్, ఎస్.రాజీలను నియమించారు. జిల్లా చేనేత విభాగం కమిటీ ఉపాధ్యక్షుడిగా పెంటపల్లి వెంకట అప్పారావును నియమించారు. జిల్లా యువజన విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా సురకళ వేణుగోపాల్, కార్యదర్శిగా గరికిన వెంకట్, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ సలీమ్, మహ్మద్ అబ్దుల్ ఆదిల్‌ను నియమించారు.

బోడి దొరకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



బోడి దొరను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : స్వాతంత్య్ర సమరయోధుడు మల్లు దొర మనవడు బోడి దొరను విశాఖ కేజీహెచ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. మోతాదుకు మించి బీపీ మాత్రలు వాడడంతో అనారోగ్యానికి గురైన బోడి దొరను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. ఆయనను భాగ్యలక్ష్మి, సుభద్ర పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకూ పరామర్శ..

చింతపల్లి మండలం మారుమూల గ్రామాలైన సంపంగిపుట్టు–వేమనపల్లి మధ్యలో సోమవారం రాత్రి జీపు అదుపుతప్పి బోల్తాపడ్డ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వంచల దుర్గానికి చెందిన బోనంకి భవానిని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇదే క్రమంలో జి.మాడుగుల మండలం కులవరపాడుకు చెందిన కొర్ర చిట్టిబాబు ఇటీవల హైవే నిర్మాణ పనుల సందర్భంగా చెట్టు తనపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అతన్ని కూడా భాగ్యలక్ష్మి, సుభద్ర పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

చేరువనే వైద్య సేవలు

- భీమ్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహణ
- 480 మందికి వైద్య సేవలు



భీమ్‌నగర్ పీహెచ్‌సీలో సేవలందజేస్తున్న వైద్యాధికారి నిఖిల్



పేర్లు నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : ప్రజారోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. జీవీఎంసీ 32వ వార్డు భీమ్‌నగర్ సచివాలయం పరిధిలో సురక్ష సర్వేలో ఎంపికైన వారికి భీమ్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 480 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. కంటి వైద్యం, గైనకాలజీ, డెర్మటాలజీ విభాగాలకు సంబంధించి పలువురిని మెరుగైన వైద్యం నిమిత్తం పంపించారు. మిగిలిన వారికి ఆర్థోపెడిక్, అప్తమాలజీ, గైనకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు, రాగిపిండి, పాలు వాటి ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని, మునగాకు, తోటకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు తరచూ తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌నగర్ సచివాలయం పరిధిలో గల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించారు..



నేను స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. ఇప్పుడు శిబిరంలో వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. డాక్టర్లు బాగా చూశారు. జగనన్న ప్రజల కోసం మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

– త్రినాథ్ పాణిగ్రహి

చక్కగా చూసారు..



నేను గ్యాస్ట్రిక్ సమస్యతో వచ్చాను. వైద్య శిబిరంలో డాక్టర్లు చక్కటి సేవలందించారు. అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. అవసరమైన మందులు అందజేశారు. పేదల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి కార్యక్రమం చేపట్టారు. ఆయనకు ధన్యవాదాలు.

– షబీనా బీబీ, పూతివారిమాన్యం

ఘనంగా ముగిసిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ ఆస్పత్రులు సంయుక్తగా నిర్వహించిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్ గురువారంతో ముగిసింది. ఈనెల 11న మొదలై నేటి వరకు ఏఎంసీ, ఇతర మైదానాల్లో పలు ఈవెంట్లు జరిగాయి. ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు, అలాగే ఏఎంసీ వంద సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మిగతా ఆస్పత్రుల కంటే ఎక్కువ బహుమతులు గెలిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. వివిధ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను సూపరింటెంటెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు అందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న కేజీహెచ్ ఉద్యోగులు

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

మహారాణిపేట : సాగుకు అవసరమైన రుణాలు అందించి రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ మర్రిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 2024–25 వార్షిక బడ్జెట్‌పై సభ్యుల సమక్షంలో పూర్తి స్థాయిలో చర్చించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో బ్యాంక్ బ్రాంచిల ద్వారా అమలు చేస్తున్న కార్యకలాపాలను బ్యాంక్ సీఈవో డీవీఎస్ వర్మ మహాజన సభ ముందుంచారు. డిసెంబర్ మాసాంతం వరకూ వచ్చిన ఆదాయ, వ్యయాలపై వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే కార్యకలాపాలు, వాటికి వెచ్చించే బడ్జెట్‌ను తెలియజేశారు. దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ సొసైటీల బలోపేతానికి పీఏసీఎస్ అధ్యక్షులు కృషి చేయాలన్నారు. సొసైటీల ద్వారా ఇచ్చిన రుణాలు సకాలంలో చెల్లించటం ద్వారా ప్రభుత్వం అందించే పలు రాయితీలు వస్తాయని, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతా సమన్వయంతో పని చేసి బ్యాంకు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. సొసైటీల బలోపేతం, రైతాంగానికి అందించాల్సిన మరింత సాయంపై పలువురు సభ్యులు సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వంచే కొత్తగా నామినేట్ అయిన చైర్మన్లను కోలా గురువులు ఘనంగా సన్మానించారు. సభ్యుల సహకారంతో సొసైటీల అభివృద్ధికి పని చేయాలని కోరారు. మహాజన సభలో కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వర్మ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.